# తెల్లారే ముహూర్తం

ఇవ్వాళ పొద్దున్న అతను వచ్చాడు. రెండు సంపెంగ పూవులు తెచ్చాడు. ఎప్పుడో ఒకసారి, నాకు సంపెంగ పూవులంటె చాలా ఇష్టమని చెప్పాను. అప్పటినుంచీ, అల వాటుప్రకారం సంపెంగ పూవులు తెస్తూనే ఉంటాడు.

అతని దృష్టిలో ఆ సంపెంగపూవులకు ప్రత్యేకమైన అర్థమేమీ వున్నట్లు లేదు; నాకా పువ్వులంటే ఎందుకంత ఇష్టమో అతనికి తెలుసా ?

అసలు నన్ను గురించి అతనికి ఎంతవరకు తెలుసు !

ఆమాట కొస్తే, అతన్ని గురించి నాకుమాత్రం ఏం తెలుసు ? దగ్గర చుట్టం కాకపోయినా ఈ సంబంధం నిశ్చ యమైనప్పటినుంచి తరచుగా వస్తూనే వున్నాడు. కాని...

♦♦ ♦♦ ♦♦

అయినా ఇవ్వాళ తలుచుకుంటె అతనితో నాకు ఏమీ పరిచయం లేనట్టే తోస్తున్నది. ఎక్కడో చదివాను:

'ఒక వ్యక్తి, ఇంకొక వ్యక్తిని గురించి ఎప్పుడూ పూర్తిగా తెలుసుకోలేడు. ప్రతివ్యక్తి తన చుట్టూ ఒక గుడి కట్టుకుంటాడు. ఆ గుడి కిటికీ ఊచల బయటనుంచి తొంగి చూస్తూ ఆ కన్పించేదే అంతా అనుకుంటాడు. కాని, పూర్తిగా ఎప్పటికీ అర్థంచేసుకోలేడు.

♦♦ ♦♦ ♦♦

ఈ అపరిచిత వ్యక్తితో నాజీవితం ఎల్లా వెళ్ళుతుంది?

ఒక్కొక్కరి మీద కారణం లేకుండానే మనకు అయిష్టత కలుగుతుంది. ఆ మనిషిని గురించి మంచిగాని, చెడుగాని, మనకు ఏమీ తెలియకపోవచ్చు. అయినా ఈ అయిష్టతకు కారణం చెప్పలేం.

♦♦ ♦♦ ♦♦

అతన్ని గురించి తలుచుకున్నప్పుడల్లా నా కెందుకో ఎటువంటి ఉత్సాహమూ కలగడంలేదు.

అతనితో నా జీవితం సవ్యంగా గడుస్తుందని నమ్మకం కుదరడంలేదు.

అయినా, అంతానిశ్చయమైన తర్వాత, ఇప్పుడు అతని లోపాలను ఏకరువుపెట్టుకోకూడదేమో!

పిన్నికి కోపం తెప్పించకుండా ఇప్పుడు ఇందులోనుంచి తప్పించుకోలేను.

* * * *

ఒకరోజు మధ్యాహ్నం, నేను లేననుకుని, పిన్ని, రాజమ్మగారు, మాట్లాడుకుంటున్నారు.

'అంతా నిశ్చయమైనట్లేనా ?'—రాజమ్మ అడిగింది.

'ఆహా ! ముహూర్తం . నెలకూడా లేదు' అని పిన్ని చెప్పింది.

పెళ్లిపనులన్నీ అయినట్లేనా ?'

పిన్ని ఏదో అనబోయి, చటుక్కున నన్ను చూసి ఆగి పోయింది. ఇద్దరూ నవ్వుకున్నారు. ఆ ప్రసంగంతో నాకు సంబధం లేనట్లే అవతలికి పోయాను.

* * * *

పిన్ని ఈ సంబంధం చెయ్యాలని ఎంత వుత్సాహపడు తున్నదో!

వెర్రికోపం వస్తే తమాయించుకోలేదుగాని, నిజానికి పిన్నికి నామీద ఎంత ప్రేమ!

ఆవిడ మనస్సు ఎలా నొప్పించగలను?

పిన్నిమాటలు సహించినట్లే నేను ఏదైనా ఓర్చుకో గలను. నా ఊహలన్నీ నాలోనే దాచుకోగలను—ప్రపంచా న్నంతా నాలోనే ఇముడ్చుకోగలను!

నన్ను గురించి నాకు విచారంలేదు. కాని అతనికి జీవి తంలో కావలసిన సంతోషాన్ని ఇవ్వగలుగుతానా?

నా మనస్సు ఏ విషయంలోనూ ఇంకా వకనిర్ణయానికి రాలేదు. ఈ సందేహావస్థలో అతని జీవితానందం నా బాధ్య తగా చేసుకుంటున్నాను. ఈ బరువు మోయగలనా!

ఏమో! ... అంతా మంచికే కాకూడదూ?

*         *         *         *

అత్తయ్య భోజనానికి పిల్చింది. నాకు వెళ్ళాలని లేదు. అయినా అత్తయ్య కోసం వెళ్లాను. ఎందుకో, మామయ్య కన్న నాకు అత్తయ్యతోనే ఎక్కువ స్నేహం. అనకూడదు కాని మామయ్యకు ఎప్పుడూ ముక్కుమీదనే కోపం. ఏ నిమి షాన ఏమంటాడోనని హడలిపోతూనే వుంటాను.

పాపం! అత్తయ్య ఓపిగ్గా బోలెడు వంట వండింది.

కాని మామయ్యకు ఒక్కటీ నచ్చలేదు.

ఎందుకో, భోజనానికి వచ్చినప్పటినుంచీ ధుమ ధుమ లాడుతున్నాడు.

'కూరలో వుప్పు తక్కువ! పులుసులో వుప్పు ఎక్కువ'— అని మొదలుపెట్టాడు.

నాకు ఒక్క మెతుకైనా తినబుద్ధిపుట్టలేదు.

కళ్లతో నవ్వుతూన్నట్టునా్న, వడ్డిస్తూంటే అత్తయ్యకు చేతులు వణకుతూనే వున్నవి.

ఈ వణుగుడుకు 'climax' ఏమిటో అని నేనూ భయపడుతూనే వున్నాను—ఆఖరుకి, అనుకున్నంతా అయింది. ఒక్కసారి విస్తరి విసిరేసి లేచి చక్కాపోయాడు మామ!

ఆ క్షణంలో మామముఖం తలచుకుంటే ఇంకా నాకు విచారంగానే వుంటుంది.

మనకి ఆపుకోలేని కోపం వచ్చినప్పుడు ఒక్కసారి అద్దంలో చూసుకోవాలి. ఆ నిమిషంలో ముఖం ఎంత అందవికారంగా వుంటుందో! ఒక్కసారి చూస్తే, మళ్ళీ మనకెప్పుడూ కోపం రాదు.

కాని, అత్తయ్యసంగతే చెప్పుకోవాలి. ఏమైనా తొణకదు గదా! పైగా నవ్వుతుంది!!

ఏం మనిషి! ఎల్లా నవ్వుతుంది?

'ఎప్పుడూ ఇంతే. ఎవరిమీదో వచ్చిన కోపం అంతా ఇంట్లో నామీద చూపిస్తూ వుంటారు' అని నవ్వింది.

మధ్యాహ్నం ఇంటికి వచ్చేస్తూ అత్తయ్యను అడిగాను. 'మామకు కోపంవస్తే నీకు కష్టంగా వుండదూ?' అని.

'ఎందుకూ కష్టం! పదేళ్లనుంచి చూస్తున్నాను. ఇవ్వాళేం కొత్తా! అయినా ఆయనకు నిజంగా నామీదెప్పుడూ కోపంరాదు. నారయ్య శిస్తు బకాయిపెట్టాడని,

చంద్రయ్య ధాన్యం దాచేశాడని, ఈ చిరాకులన్నీ ఇంట్లోకి వస్తూవుంటాయి; అంతే' అన్నది.

పదేళ్లు! బాబోయ్!!

నేనూ అత్తయ్యలాగ వుండగలనా!

ఎందుకో, చెప్పలేని భయంవేసింది. ఇంటికి వచ్చేసరికి గేటు తీయకుండా గడియఆలాగే పట్టుకు నిలుచున్నా.

పక్క ఇంటి పంజాబీ అమ్మాయి నన్నుచూసి పక్కున నవ్వింది.

'ఏం అక్కా! ఎండ చల్లగావుందా?'

నవ్వుతూ లోపలి కొచ్చేశాను. ఆ పిల్ల నవ్వకపోతే నా గుండెబరువు మోయలేకపోదును.

ఏమి నవ్వు ముత్యాలు వలకబోస్తుంది! ఎక్కడా విచారపు ఛాయకూడా దానిని తాకదు.

—అమె కింకా పెళ్ళి కాలేదు!

* * * *

ప్రొద్దుటినుంచీ ఏమీ తోచడంలేదు..

ఇప్పటికి మూడు రోజులనుంచి శ్యామలకోసం ఎదురు చూస్తున్నాను. కాని శ్యామల రాదు. నేనే వెళ్ళి చూస్తాను. కాలేజి మానేసినప్పటినుంచి శ్యామల నాకు దూరమైపోయింది. ఇదివరకు వక్క నిమిషమైనా నన్ను విడిచి వుండగలిగేది కాదు. ఇప్పుడు జ్ఞాపకార్థం కలుసుకోవాలని ఎప్పుడైనా కలుసుకుంటాం. మేము ఎప్పుడూ పోట్లాడుకోలేదు. అయినా మాకు తెలియకుండానే మా స్నేహం క్షీణించింది. దీనికి కారణం, ఆమెలో వున్నదో నాలో వున్నదో నేను

చెప్పలేను. కాని శ్యామలను నేను ఎప్పుడూ మరచిపోలేను. ఇవ్వాళ మళ్ళీ నా ఆలోచనలన్నీ ఆమెతో చెప్పుకోవాలని పిస్తున్నది. శ్యామలను మళ్లీ నాకు దగ్గరగా చేసుకోవాలని పిస్తున్నది.

* * * *

పిన్ని పూర్తిగా పెళ్ళి పనుల్లో నిమగ్నురాలై పోయింది. బాబాయికి కూడా తీరికవుండటంలేదు. ఈ హడా విడితో నాకు ఏమీ సంబంధం లేనట్లేవుంది. నన్ను ఎవ్వరూ పలకరించరు. నా సలహా ఎవ్వరికీ అక్కరలేదు. వ్యర్థాలోచ నలతో ముందుకీ వెనక్కీ వూగుతున్నాను.

ఎందుకు ఎగురుతున్నదో ఎక్కడికి వెళ్లుతున్నదో కూడా తెలియకుండా, గాలితో కదలిపోయే ఆకులాగ వున్నది నా పరిస్థితి ...

పోస్ట్.

కస్తూరిదగ్గరనుంచీ, చంపకందగ్గరనుంచీ, రెండు వుత్తరాలు వచ్చినై-ఒకేసారి. రెండూకూడ ఏమీ ఉత్సా హాకరంగా లేవు.

కస్తూరి తనఉద్యోగం ఏమీ బాగులేదని రాసింది.

'రోజురోజుకు, ఈ పని చేయలేననిపిస్తోంది. ప్రొద్దున్న మొదలు, రాత్రివరకు, క్షణం తీరికలేకుండా, పని సరిపో తోంది. సమాజాన్ని పైకి తీసుకురావాలని ఎంతో పాటు పడుతున్నాను. వక్కనిమిషం వృథాచేయడంలేదు. అయినా జీవితం ఎప్పుడూ ఏదో వెలితిగా కనపడుతోంది. ఎప్పుడూ సంతృప్తిలేదు...'

ఇక చంపకం;

... 'ఇంట్లో ఎప్పుడూ ఏదో గొడవగానేవుంటుంది. ఒక్క-నిమిషం నీకు వుత్తరం రాయటానికి కూడా, విశ్రాంతి వుండటంలేదు. అన్నీ సహించుకోగలమని మొండిధైర్యం వున్నవాళ్లు తప్ప పెళ్లిచేసుకోకూడదేమో?

'చదు వెందుకు మానేశానా అనిపిస్తోంది-ఇప్పుడు. మనస్సేమీ తృప్తిగా వుండటంలేదు...'

ఈ రెండువుత్తరాలు నన్ను వూరికే కలవరపెడుతున్నాయి. ఎప్పుడూ ఇంతేనా?

ఏ త్రోవతొక్కి-నా చివరకు అసంతృప్తేమిగులుతుందా?

మా పరీక్ష పూర్తయినరోజు జ్ఞాపకంవచ్చింది.

ఉన్నట్టుండి ఏదో పెద్ద బరువు తీసివేసినట్లున్నది. ఈ వారంరోజులు ఏ ఆలోచనలు మనస్సును బాధించలేదు ఏదో చీకటిగుహలో దూరి ఈ సాయంత్రమే బయటికి వచ్చినట్లున్నది. ఈలోపల ఏం చదివానో! ఏంరాశానో!

ఈ పరీక్ష నేను రాయలేదు.

వారంరోజులనుంచి ఈ సాయంత్రంకోసం ఎదురు చూస్తున్నాను. ఎందుకో! ఏంచేయాలనో?

ఇవ్వాళ తీరా పరీక్షల బెంగ వదిలేసరికి ఏదో భరించలేని వెలితి క్రమ్ముకొన్నది.

కాలేజీనుంచి వస్తూ చంచల, కమల అందరూ గలగలా వాగారు. అందరూ వాళ్లు ఇకమీద ఏమి చేయదలచుకొన్నదీ, వాళ్ల ఆదర్శాలు, నిశ్చయాలు అన్నీ గబగబా చెబుతోవుంటే విస్తుపోయి విన్నాను.

కమల నా దగ్గరగా వచ్చి అడిగింది.

'పరీక్ష ప్యాసవుతే ఏంచేస్తావు?' అని

'నాకు తెలియదు' అనిచెప్పాను. అందరూ నవ్వారు.

కాని నేను నిజమే చెప్పాను. ఆవిషయాన్నిగురించి నేను ఎప్పుడూ ఆలోచించుకోలేదు. జీవితంలో ఏంచెయ్యాలను కుంటున్నానో కూడా ఎప్పుడూ ఆలోచించుకోలేదు.

నాకు పెళ్ళిచెయ్యాలని మా పిన్ని ఆరునెలల క్రిందటే సంబంధం నిశ్చయించి పెట్టింది. ఈ సంగతి ఎవరితోనూ చెప్పుకోలేదు. ఈ పెళ్ళి నాకు ఇష్టమూ అయిష్టమూ అని కూడా ఎప్పుడూ ఆలోచించుకోలేదు.

ఇవాళ ఇవన్నీ తలుచుకుంటె భయంవేస్తోంది. జీవితంలో మనం ఏంచెయ్యాలని భగవంతుని వుద్దేశమో? ఎవరైనా చెపితే బాగుండును. దేవుడు మనకు జీవితాన్నిస్తాడు. దీనితో ఏమిచెయ్యాలో చెప్పడు.

పుట్టినప్పుడే మనముఖాన ఈ విధంగా వుండాలని ఈ మార్గంలో నడవాలని ముద్రవేసి వుంచితే! అద్దంలో అది చదువుకుంటూ ఆ మార్గాన్నే అనుసరించవచ్చు.

అప్పుడు జీవితంలో సుఖం లేకపోవచ్చు, కాని తప్పు త్రోవ యేమోనన్న భయంవుండదు. హృదయంలో ఆనందం లేకపోవచ్చు, అసంతృప్తి వుండదు.

కాని నిజానికి మనకు తెలియకుండానే ఈ జీవనది భగవంతుని ఇచ్ఛానుసారమే ప్రవహిస్తున్నదేమో! లేకపోతే ఈ ఒడిదుడుకులు, ఈ మెరక పల్లాలు, వీటిని సరిదిద్దడానికి మన కేమిశక్తి వున్నది! * * *

సాయంత్రం శ్యామలను చూడడానికి వెళ్ళాను. ఊరికే నా మనస్సు క్షోభపడుతున్నది. ప్రతివాళ్ళూ, పెళ్ళికి ముందు యిలాగే బాధపడతారా? లేక ఈ బాధ నా వంతు మాత్రమేనా?...

నే నేమీ ఆలోచించుకోలేను. శ్యామలకు అంతా చెప్పి, ఆమెతో నా బాధ పంచుకొని, నా జీవితం నిర్ణయించి పెట్టుమని అడగాలనుకున్నాను. ఒకొక్కప్పుడు స్నేహ మెంత అవుసరమవుతుందీ?

కాని తీరా వెళ్ళాక ఒక్క మాటైనా మాట్లాడలేక పోయాను.

వెళ్ళగానే 'ఇదేమిటి! పెళ్ళికూతురు ఇల్లు కదిలిందే ... పెళ్ళికొడుకు పెద్ద ఇంజనీర్ కాబోతున్నాడుటగా! ఇంక మేము జ్ఞాపకముంటామా!' అంటూ వెక్కిరించటం మొదలు పెట్టింది.

ఇంక ఆమెతో నేనేమీ చెప్పలేకపోయాను. కాస్సేపు అర్థంలేనిమాటలు మాట్లాడి వచ్చేశాను. ఎప్పుడూ శ్యామల కళ్ళల్లో, లేని స్నేహాన్ని వెతుక్కుంటాను.

మనం వూహించుకున్నదానికీ, వాస్తవానికీ ఎంత వ్యత్యాసం ఉంటుంది!

* * * *

ఇంటికి వచ్చాక చాలాసేపు బాబాయితో మాట్లాడుతూ కూర్చున్నాను. ఆయనతో ఎంతసేపయినా మాట్లాడుతూ వుండాలనిపిస్తుంది. ఆయన ఏ విషయాన్నిగురించి మాట్లాడినా, ఏదోవిధంగా మనశ్శాంతి కలుగుతుంది. ఆయన

పట్టుదల లేకపోతే నాకీ చదువు వచ్చివుండకపోను. పిన్నికీ, బాబాయికీ మధ్య ఎంత తేడా!

* * *

దీపాలు పెట్టాక యెవరికీ తెలియకుండా గుళ్ళోకి వెళ్ళాను.

భగవంతునికి మొక్కుకున్నాను: 'భగవాన్! ఈ జీవితం నీది. సుఖమైనా, దుఃఖమైనా, నీ చేతులలోనుండి వచ్చినదేనని భరిస్తాను. నావల్ల ఎవరికి అణుమాత్రమైనా బాధ కలుగకుండా చూచుకుంటాను.'

ఆ నిమిషంలో నాలో గొప్ప శాంతి కలిగింది. ఆ అనుభూతి వర్ణించలేను.

రేపు ఇల్లువిడిచి వెళ్ళుతాను.

బాబాయి నన్ను దగ్గరకు పిలిచి నా తల నిమురుతూ అన్నాడు: 'ఇప్పటికి నీభారం వదుల్చుకుంటున్నాను. అతను చాలా మంచివాడు. ఇంక నిన్నుగురించి నాకేమీ విచారం లేదు.'

నాకు కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగాయి. కనబడకుండా తుడిచేసుకున్నాను.